www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 25 అక్టోబర్ 2023

5

తిరుపతి





రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన అఖిలపక్షం నేతలు, అధికారులు

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

నేడు టిటిడి పరిపాలనా భవనం వద్ద నిరసన
తిరుపతి నగర అభివృద్ధి వేదిక పిలుపు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని అఖిలపక్షం, పలు ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. తిరుపతి అభివృద్ధి వేదిక కన్వీనర్ టి. సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సోమవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఈ మేరకు తీర్మానించింది. యశోదా నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో తిరుపతి అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో తిరుపతి నగర అభివద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలని, ఈనెల 25న బుధవారం టీటీడీ పరిపాలనా భవనం వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, జనసేన నేత బి. మధు, వైసిపి నేత ఎస్వీయూ పాలకమండలి సభ్యులు ఎం. మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డిఎంసి భాస్కర్, బిఆర్ఎస్ నేత ఆర్కాట్ కష్ణ ప్రసాద్, ఆర్.పి.ఐ నేత పి. అంజయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు ఎన్ నగేష్, ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రత్నకుమార్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే. లోకేశ్వర వర్మ, తిరుపతి ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షులు తమటం రామచంద్రారెడ్డి, కవి రచయిత గొడుగుచింత గోవిందస్వామి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకష్ణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతిలు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగించారు. అభివద్ధి నిరోధకుల తాటాకు చప్పుళ్ళకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం జడిసి తిరుపతికి కేటాయించాల్సిన అభివృద్ధి నిధుల ప్రతిపాదనలను తిరస్కరించడం తిరుపతి ప్రజల మనోభావాలను అవమానించడమేనని తీవ్రంగా విరుచుకుపడ్డారు. బిజెపి, ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి లు మొదటి నుంచి తిరుపతి అభివద్ధికి, టీటీడీ ఉద్యోగులు, ప్రజలు, యాత్రికుల పట్ల తమ బాధ్యతా రాహిత్యాన్ని చాటుకుంటూనే ఉన్నాయని, ఇది తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం టిటిడి ప్రతిపాదనను తిరస్కరించడం అంటే ప్రభుత్వం ఆడుతున్న 'డ్రామా'నా అన్న అనుమానం కలుగుతోందని విమర్శించారు. తిరుపతి ప్రజలు ఎన్నో త్యాగాలు చేశారని వారి ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి యాత్రికుల, భక్తుల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని కళ్యాణి డ్యాం నుంచి తమకు రావలసిన నీటిని తిరుమల కొండకు పంపడం ద్వారా తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారని గుర్తు చేశారు. టీటీడీ ఇస్తున్న నిధులు తమ ఆదాయంలో శాతం కాదని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకంలో భాగంగా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. 500 కోట్ల ఆదాయం, 1000 కోట్ల టర్నోవర్ ఉన్న ఏ సంస్థ అయినా సామాజిక ప్రయోజనాలు కాపాడేందుకు తమ ఆదాయంలో రెండు శాతం నిధులు కేటాయించాలని 2013లో కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిందని, ఆ చట్టానికి లోబడి రెండు శాతంలో ఒక శాతాన్ని తిరుపతి మున్సిపాలిటీకి ఇవ్వడం అధర్మం ఎలా అవుతుందని వారు ప్రశ్నించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్, విహెచ్ పి లాంటి సంస్థల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి పోయిందని తాము భావించటం లేదని, వాస్తవంగా సి ఎస్ ఆర్ ఫండ్స్ కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని వక్తలు గుర్తు చేశారు. ఏడాదికి రెండు శాతం నిధులను ఎలా ఇస్తున్నారో వెల్లడి చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి అనుయాయ సంస్థలకు కేటాయిస్తున్నారన్న అనుమానం వ్యక్తం చేశారు. టీటీడీ యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2014 నుంచి ఏ సంస్థకు, ఏ పీఠాధిపతికి, ఏ మఠాధిపతికి ఎవరికి ఎంత నిధులు కేటాయించారో వెల్లడి చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి నగర ప్రజల సౌకర్యాలకు పునాది వేయడం అంటే తిరుపతికి వచ్చే యాత్రికులు, భక్తుల సౌకర్యానికి పెద్దపీట వేయడమేనని గుర్తు చేశారు. ఇప్పటికీ తిరుపతి నగరంలో పారిశుధ్య సమస్య, మంచినీటి సమస్య, కార్మికుల కొరత పీడిస్తున్న అంశాలుగా గుర్తించాలని వక్తలు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి ప్రజల మనోభావాలను గమనంలో ఉంచుకొని నిధుల కేటాయింపు విషయంలో పునరాలోచన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. 25వ తేదీన టీటీడీ పరిపాలన భవనం వద్ద జరిగే భారీ ధర్నా కార్యక్రమానికి తిరుపతి నగర ప్రజలు పెద్ద ఎత్తున రావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు వేణు, మల్లికార్జునరావు, చిన్నా, బాలాజీ, గంగులప్ప, చంద్రశేఖర్, పార్థసారథి, జనసేన నేత బి.మునస్వామి, టిఆర్ఎస్ నేత బెల్లంకొండ సురేష్, బీసీ సంరక్షణ సంఘం నేత నారాయణ తదితరులు పాల్గొన్నారు.



'పతి' కోసం 'సతి'

- నేటినుంచి 'నిజం గెలవాలి' కి శ్రీకారం
- నారావారిపల్లి నుంచే భువనేశ్వరి ప్రారంభం
- తిరుమల 'శ్రీవారి'కి, నాగాలమ్మకూ ప్రత్యేకపూజలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఇన్నాళ్లూ రాజకీయాల్లో ఎక్కడా కనిపించని నారా భువనేశ్వరి అనివార్యంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టనున్నారు. భర్త నారా చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు పెట్టినందుకు నిరసనగా 'నిజం గెలవాలి' అంటూ నేటినుంచి సభల్లో పాల్గొననున్నారు. అలాగే చంద్రబాబును అరెస్టు చేశారని తెలిసి తట్టుకోలేక మృతిచెందిన టిడిపి శ్రేణుల కుటుంబాలను స్వయంగా పరామర్శించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తిరుపతికి విచ్చేసిన నారా భువనేశ్వరి 'నారా' కుటుంబానికి ఉన్న సెంటిమెంట్‌తోనే శ్రీవారి ఆశిస్సులను మంగళవారం తీసుకున్నారు. అలాగే చంద్రబాబు సొంతూరైన నారావారిపల్లిలో అత్తమామ సమాధులకు నివాళి అర్పించారు. కులదైవమైన నాగలామ్మకూ పూజలు చేశారు.

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆయన సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి'కి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంగళవారం నారా భువనేశ్వరి, చంద్రబాబునాయుడు చెల్లెలు కనుమూరి హైమావతితో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 11.15 నిమిషాలకు చంద్రగిరి నియోజకవర్గాం నారావారిపల్లి చేరుకున్న ఆమె కులదైవమైన నాగలామ్మకు పూజలు చేశారు. అనంతరం అత్తమామలైన ఖర్జూరనాయుడు, నారా అమ్మణ్ణమ్మలకు నివాళి అర్పించారు. ఊళ్లో పెద్దల ఆశిస్సులు తీసుకున్నారు. జిల్లా టిడిపి అధినేతలు ఆమెను పరామర్శించారు. చంద్రగిరి మండలం అగరాల వద్ద మంగళవారం సాయంత్రం 3 గంటలకు ఐదువేల మంది మహిళలతో 'నిజం గెలవాలి' సభను నిర్వహించనున్నారు. అంతకుముందు చంద్రగిరి మండలం రంగంపేట, పాకాల మండలం నేంద్రగుంటలో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక





నారావారిపల్లిలో...

అకాల మరణం చెందిన వారి కుటుంబాలను పరామర్శించనున్నారు. అనంతరం నారావారిపల్లికి విచ్చేసి తన తండ్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి మధ్యాహ్నం సభలో పాల్గొంటారు. ఎంఎల్‌సిలు పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పులివర్తినాని, నందమూరి లోకేశ్వరి కుమార్తె చాముండేశ్వరి, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, తెలుగు యువత రాష్ట్ర నాయకులు రవినాయుడు, మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

భువనేశ్వరి సభను విజయవంతం చేద్దాం: డాక్టర్ బాలసుబ్రమణ్యం

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా ఆయన సతీమణి నారా భువనేశ్వరి బుధవారం అంకుర హాస్పిటల్ వద్ద బహిరంగ సభను నిర్వహించనున్నారని, నిజం గెలవాలి పేరుతో నిర్వహించే ఈ సభను విజయవంతం చేద్దామని టిడిపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఈ సభకు సంబంధించిన పోస్టర్లను టిడిపి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలోనే తిరుపతి ఎంతో అభివద్ధి చెందిందన్నారు. ప్రజలకు చంద్రబాబు సేవలు ఎంతో అవసరమని ఆనాడు అలిపిరి బాంబు బ్లాస్ట్ ఘటనలో తిరుమల శ్రీవారు ఆయన ప్రాణాలను రక్షించారని అన్నారు. చంద్రబాబు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రాక్షస ఆనందాన్ని పొందుతున్న నేపథ్యంలో నారా భువనేశ్వరి తన ఆవేదనను ప్రజలకు వివరిస్తూ బస్సు యాత్ర చేస్తారన్నారు. ఎవరు ఎన్ని చేసినా అంతిమ విజయం న్యాయందేనని, చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి నాయకురాలు అంబూరు సింధుజ, టిడిపి శాలివాహన సాధికార సమితి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు ఆముదాల తులసీదాస్, తెలుగు యువత నాయకులు పెరుమాళ్ మధు, హిమత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో నారా భువనేశ్వరి

చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. భువనేశ్వరితో పాటు టీడీపీ ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు. దర్శనం అనంతరం అర్చకులు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె నారావారిపల్లెకు బయలుదేరారు. బుధవారం నుంచి నారా భువనేశ్వరి బస్సు యాత్ర నారావారిపల్లె నుంచి ప్రారంభం కానుంది. గెలవాలి అనే పేరిట ఆమె ఈ యాత్రను చేపట్టనున్నారు.



నారా భువనేశ్వరిని కలిసిన జనసేన జిల్లా నాయకులు పసుపులేటి హరిప్రసాద్

తిరుపతిలో చిల్లీస్ 3వ బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటి



తిరుమల బైపాస్ రోడ్‌లో తిరుమల మ్యూజిక్ సెంటర్ పక్కన చిల్లీస్ రెస్టారెంట్ మూడవ బ్రాంచి ప్రారంభించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిల్లీస్ ఫౌండర్ మధు మోహన్ రావు దంపతులు, సింధూరి పార్క్ అధినేత వెంకయ్య , బ్లీస్ హెూటల్ అధినేత బాలకష్ణ రెడ్డి , తిరుపతి ఈస్ట్ డిఎస్పి సురేంద్ర రెడ్డి చేతులు మీదుగా చిల్లీస్ రెస్టారెంట్ హెూటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ చిన్న వయసులో చిల్లీస్ రెస్టారెంట్ అండ్ హెూటల్స్ అధినేత వీరాంజనేయులు (చిల్లీస్ అంజి) ని తిరుపతి జిల్లా హెూటల్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా చిల్లీస్ అంజిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న నెల వ్యవధిలోని అంజి మంచి సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు హెూటల్స్ అండ్ రెస్టారెంట్స్ యజమానులకు ప్రతినిధుల బందానికి సిబ్బందికి అనేక సహాయ సహకారాలు ప్రోత్సాహం అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కొర్లగుంటలో మూడో బ్రాంచ్ చిల్లీస్ రెస్టారెంట్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే తిరుపతిలో మూడు బ్రాంచ్లు కడపలో ఒక బ్రాంచ్ని ప్రారంభించడం జరిగిందని, త్వరలో మరో బ్రాంచ్ ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలియజేశారు. అనంతరం చిల్లీస్ అంజి మాట్లాడుతూ నగర ప్రజల కోరిక మేరకు కొర్లగుంటలో రెస్టారెంట్ మూడో బ్రాంచ్ ను ప్రారంభించామని చెప్పారు. గత 14 సంవత్సరాల నుంచి కష్టమర్లు చిల్లీస్ రెస్టారెంట్ అండ్ హెూటల్స్ ను ఎంతో ఆదరించి అభిమానిస్తున్నారని తెలియజేశారు. తాను సేవ్ వాటర్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించడం జరిగిందని ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించడం వలన ఎంతో పేరు ప్రఖ్యాతులు తనకు తన బందానికి రావడం కస్టమర్ల సేవే అని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తిరుపతి జిల్లా హెూటల్ రెస్టారెంట్స్ సెక్రటరీ నితిన్ చక్రవర్తి, ట్రెజరర్ శ్రీహరి, అసోసియేషన్ నేతలు సభ్యులు పాల్గొన్నారు..

బంగారు... 'తగ్గేదేలే'..!

10 గ్రాముల బంగారం రూ.61,750
కేజీ వెండి ధర రూ.78,700
దీపావళి వరకూ ఇంతేనా...!!

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

దీపావళి అంటేనే వెలుగుల పండుగ.. బాణసంచా పేల్చి పిల్లలు కేరింతలు కొడుతుంటే, మహిళలు బంగారం కొని ఆనందపడుతుంటారు.. సహజంగా దసరా నుంచి దీపావళి వరకూ మహిళలు ఎంతోకొంత బంగారం కొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే ఈసారి దీపావళికి బంగారం ధర తగ్గేదేలే అనేలా ఆకాశం వైపే చూస్తోంది. పది గ్రాముల బంగారు ధర రూ.61,750 ఉంది. కేజీ వెండి ధర రూ.78,700గా ఉంది. ఏమైనా దీపావళి వరకూ ఇదే ధరలు ఉంటాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు బంగారు షాపుల్లో అక్రమ నిల్వలు ఉన్నాయన్న సమాచారంతో రాయలసీమ పరిధిలో ఐటి దాడులూ జరుగుతుండటం గమనార్హం.

దసరా రోజు ఏ కార్యం చేపట్టినా విజయోస్తు అనేలా ఉంటుందని భక్తుల నమ్మకం. అందుకే కొత్త పనులు ఏవైనా దసరా రోజు ప్రారంభిస్తారు. అలాగే మహిళలు సైతం బంగారం కొనుక్కునేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అయితే దసరా పండుగకు బంగారం కొనేందుకు వెళ్లిన మహిళలు ధరలు చూసి వెనకడుగు వేశారు. పశ్చిమాసియా దేశాల్లోని ఇజ్రాయిల్ - పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా బంగారం ధరలు కొంత పెరిగినట్లు బంగారు నగల వ్యాపారులు చెబుతున్నారు. మరికొన్ని రోజులు ఇలాగే ఉంటాయని తెలుస్తోంది. దీపావళి పండుగకు బంగారు, వెండి కొనాలని ఆశపడితే పెరిగిన ధరలతో కొనుగోలు చేయాల్సిందే. మంగళవారం నాటికి కేజీ వెండి ధర 78,700 ధర పలుకుతోంది. 24 క్యారెట్ల బంగారు గ్రాముపై 220 రూపాయలు ధర పెరిగింది. పెరిగిన ధరతో 10 గ్రాముల బంగారం రూ.61,750గా ఉంది. 22 క్యారెట్ల బంగారం గ్రాముపై 200 పెరగడంతో పది గ్రాములు 56వేలకు చేరుకుంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు పెట్టుకున్న వారు ప్రస్తుతం బంగారు కావాల్సినంత కొనే పరిస్థితి లేదు. ఏదో అవసరం మేరకు కొని సులభ వాయిదాలు చెల్లించుకోవాల్సిందేనని మహిళలు అంటున్నారు. మొత్తానికి బంగారు, వెండి ధరలు రెండూ పోటీపడి పరుగులు తీస్తున్నాయి. ఈ రెండే కాకుండా ప్లాటినం, వజ్రాలు, ఇతర అలంకరణ వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. కార్తీక మాసంలో పెళ్లిళ్ల సీజన్ ఉండడంతో బంగారు నగలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తారని వ్యాపారులు అంటున్నారు. రాయలసీమ జిల్లాల పరిధిలో బంగారు నగల క్రయ విక్రయాలు ఈ నెలలో కొంతవరకూ తగ్గినా వచ్చే నెలలో పుంజుకునే అవకాశాలు ఉన్నాయి.

వ్యాపారులపై నిఘా

బంగారు నగలు అమ్మే వ్యాపారులపై ఐటి అధికార్లు నిఘా పెట్టారు. ఇటీవల ఐటీ అధికార్లు రాయలసీమ జిల్లాలతో పాటు కడప జిల్లా ప్రొద్దుటూరులో దాడులు చేసి సుమారు 200కేజీల బంగారును సీజ్ చేశారు. వీరు ప్రభుత్వానికి ఎటువంటి ట్యాక్స్ చెల్లించకుండ అమ్మకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో ఐటి



దాడులు రాయలసీమ జిల్లాల్లో చేస్తున్నారు. తిరుపతి జిల్లాలోనూ ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించకుండా వ్యాపారులు అమ్మకాలు ఏమైనా చేస్తున్నారా? లేదా ? అని ఐటి అధికారులు నిఘా పెట్టారు. బంగారు నగల వ్యాపారులు ఐటి దాడుల సమచారం తెలుసుకుని అప్రమత్తంగా ఉన్నారు.


ముసల్‌రెడ్డి ఇండ్ల వద్ద చిరుతల సంచారం

ప్రజాశక్తి -రామచంద్రపురం

తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం, అనుపల్లి పంచాయతీ ఉప్పలివంక సమీపంలోని ముసల్ రెడ్డి ఇండ్ల వద్ద జంట చిరుతపులులు సంచరించినట్లు ప్రత్యక్ష సాక్షి తాపీ మేస్త్రి రమేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ముసల్ రెడ్డి ఇండ్ల వద్ద నూతనంగా నిర్మించే ఇంటికి టైల్స్ అమర్చే పని పూర్తి చేసుకుని రోడ్డులోకి వచ్చి చూడగా జంట చిరుత పులులు చిత్తూరు మాజీ ఎంపీ ఎన్ శివప్రసాద్ మామిడి తోట పక్కన ఉన్న పెనుమూరు ఫారెస్ట్ రేంజ్కి చెందిన ముతాలం అటవీ ప్రాంతం వైపు వెళ్లాయని ఆయన తెలిపారు. ఆ పులులను చూసి భయభ్రాంతులకు గురై ఇంట్లోకి పరుగులు తీశానని చెప్పారు. పనపాకం ఫారెస్ట్ రేంజ్ కి సంబంధించి సొరకాయల చెండ్లు వద్ద పశువులు, మేకలు, గొర్రెలు మేపుకొనే పశువుల కాపర్లు అటవీ ప్రాంతంలోనే రాత్రి వేళల్లో పశువుల దొడ్లలో పశువుల తో పాటు బస చేసేవారు. గత వారం రోజులుగా మేకలు. లేగ ఆవు దూడలు కనిపించడం లేదని పశువులు కాపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చిరుత పులలే లేగ ఆవు దూడలను, మేకలను చంపి తినేశాయోనని పశువుల కాపర్లు అనుమానం వ్యక్తం చేస్తూ భయాందోళనకు గురవుతున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు చిరుతపులులు అంటూ భయం భయంగా ఉన్నారు..... మరి కొంతమంది టపాకాయలు పేల్చి శబ్దాలు చేస్తున్నారు. ఉప్పలి వంక, గోకులాపురం, చెరువు కాడ ఇండ్లు ప్రాంతాలలోని ప్రజలు భయం గుప్పెట్లో జీవనం సాగిస్తున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ముసల రెడ్డి ఇండ్ల వద్ద అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న చిరుతపులను బోన్లు సహాయముతో నిర్బంధించి ప్రజలను రక్షించాలని పశువుల కాపర్లు, స్థానికులు కోరుతున్నారు.

తిరుమలలో వేడుకగా పార్వేటి ఉత్సవం

తిరుమల : తిరుమలలో పార్వేటి ఉత్సవం నూతన మండపంలో వేడుకగా జరిగింది. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి పాల్గొన్నారు. టిటిడిలో పనిచేస్తున్న అర్చకులు



కావచ్చు, ఆగమ పండిగులు కావచ్చు, అత్యున్నత అధికారులంతా జ్ఞానం లేకుండా పనిచేస్తారని, మనమొక్కరమే చాలా గొప్పగా ఆలోచిస్తామని అనుకోవడం బాధాకరమన్నారు. పార్వేటి మండపం చాలా శిథిలావస్థలో కూలిపోయే పరిస్థితిలో ఉండేదని, దాన్ని ఆధునీకరించామన్నారు. ప్రతి భక్తుడూ ఈ నిర్ణయాన్ని అభినందిస్తున్నారన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను వేమన విజ్ఞాన కేంద్రం ఆఫీస్ లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, జెవివి బిర్లా నాయుడు ,రఫీ, శివ, అక్బర్, అశోక్ లు గోడపత్రికను ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ వారి సహకారంతో జన విజ్ఞాన వేదిక ఈ సంబరాలను నిర్వహిస్తున్నదని తెలియజేశారు. ఈ సైన్స్ సంబరాల్లో అన్ని ప్రభుత్వ ,ప్రైవేటు ఉన్నత పాఠశాలలలో 8,9,10 వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. పాఠశాల స్థాయి పరీక్ష నవంబర్ 10న, మండల స్థాయిలో నవంబర్ 30న, జిల్లా స్థాయిలో డిసెంబర్ 17న రాష్ట్రస్థాయి జనవరి 27,28 తేదీలలో జరుగుతుందని తెలియజేశారు. సైన్స్ ప్రయోగాలు , వేమన పద్యాలు, మ్యాజిక్ లాంటీ రకరకాల కార్యక్రమాలు ఉంటాయి. వీటిలో విజేతలుగా ప్రభుత్వ పాఠశాలల నుంచి ఒక టీం, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఒక టీం ప్రకటిస్తారు.



'పంచెకట్టు' మహోత్సవంలో యువత

ప్రజాశక్తి - తిరుపతి సిటీ



గ్రామీణ ప్రాంతపు సంప్రదాయ డ్రస్సు పంచె కట్టు. ప్రస్తుత సూపర్ కంప్యూటర్ ఫ్యాషన్ కాలంలో సరికొత్త సాంకేతిక విజ్ఞానంతో యువత ముందుకు దూసుకెళ్తున్న వైనం జగమెరిగిన సత్యం. స్పీడ్ యుగానికి తగ్గట్టు ఆహారపు అలవాట్లు, వస్త్రధారణలు, వ్యవహార శైలిలు వేగంగా విస్తరించి, యువతను పూర్తిగా ఆవహించింది. ఆ దిశగా పయనిస్తున్న యువత సాంప్రదాయాలను మరిచి, విలువలను విడిచి సరికొత్త డిజైన్ టెక్నాలజీకి అలవాటు పడింది. ఈ నేపథ్యంలో బంధుమిత్రుల కలయిక ప్రాముఖ్యతను తెలియజేస్తూ, యువతకు విలువలను తెలియజేస్తూ, సాంప్రదాయాలను అలవర్చేందుకు వారు ఓ చిన్నపాటి ప్రయత్నాన్ని మొదలు పెట్టారు. ఆడపిల్లలకు ఓణీల పండుగ చేస్తాం, అదేవిధంగా మగ పిల్లలకు పంచెకట్టు మహోత్సవ నిర్వహిద్దామని ఎర్రమిట్టకు చెందిన సునీత, రజిత అక్క చెల్లెలు భావించారు. అనుకున్నది తడువుగా తోబుట్టువులు, పిన్నమ్మలు, ఆడపడుచులను పిలిచి పంచె కట్టు ఉత్సవం గురించి వివరించారు. వారి వారి ఇళ్లలోని మగ పిల్లలకు ఈ ఉత్సవాన్ని నిర్వహించి, వారికి సాంప్రదాయ విలువలను తెలియజేయాలని భావించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగింపు వేళ, దసరా ఉత్సవాల సందర్భంగా యువకులకు తిరుపతి యూత్ హాస్టల్‌ను వేదికగా చేసుకొని సాంప్రదాయ గ్రామీణ పంచె కట్టు మహోత్సవానికి తెర లేపారు. అనుకున్నది తడువుగా ఆహ్వాన పత్రికలను ముద్రించారు. బంధువులు మిత్రులు శ్రేయోభిలాషులు, చుట్టుపక్క వారికి పంచిపెట్టారు. ఆ సమయం రానే వచ్చింది. దసరా రోజు తెల్ల చొక్కా, పట్టు పంచ, కండువను ఒకే రీతిలో సిద్ధం చేశారు. పాటూరు వెంకటకష్ణ, భగత్ కష్ణ, లీలా కష్ణ, మోహిత్, ఎం హరి, నారగంటి గౌతమ్ కష్ణ, నరేష్, మహేష్, పి. పవన్ కుమార్, మచ్చల హేమనాథ్, భరత్, తరుణ్, విష్ణు సాయి, వరుణ్, జయ కాంత్, ప్రేమ చందు, జ్ఞానేంద్ర, హేమంత్ లకు తెలుగు సాంప్రదాయ పంచ కట్టును ధరింపజేసి, ఘనంగా వేడుకలు నిర్వహించారు. బంధుమిత్రులందరు వారిని ఆశీర్వదించి, అభినందించారు. అనంతరం తోబుట్టువులు, తల్లిదండ్రులు, పెద్దలు ఆటపాటలతో అలరింపజేశారు. అందర్నీ ఆకర్షింప చేసిన ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, కష్ణమ్మ, రెడ్డమ్మ కాంతమ్మ శాంతమ్మ, చిన్నక్క శివమ్మ, సుజన నాగభూషణమ్మ నీలమ్మ, శోభ, అరుణ, కరుణ, వసంతమ్మ, జయంతి, బాలయ్య సునీత, ప్రనూష ఎం మధు, మహేశ్వరి, గిరి, తదితరులు పాల్గొన్నారు.

భక్త కనకదాసు కూడలి ఏర్పాటు చేయాలి: జబ్బల శ్రీనివాసులు

తిరుపతి (మంగళం): ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో భక్త కనకదాసు కూడలిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర కురబ, కురమ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురబ, కురమ సంఘం 8వ వార్షికోత్సవం, రాష్ట్ర పదాధికారుల సమావేశం, శ్రీ భక్త కనకదాసు జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన కురబ, కురమ కులానికి చెందినవారు వేల సంఖ్యలో హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాలకు కర్ణాటక మంత్రులు, పీఠాధిపతులు, రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో భక్త కనకదాసు భవన నిర్మాణం కోసం ఐదు ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో కురబ, కురమ జనాభా దామాషా ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించే రాజకీయ పార్టీకి తమ పూర్తి మద్దతు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డప్ప, రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. శ్రీనివాసులు, రుయా మల్లి పాల్గొన్నారు.

ఆలయాలకు వెండి ఆభరణాలు వితరణ


ఆలయానికి వెండి ఆభరణాలు సమర్పించిన దాతలు

ప్రజాశక్తి -తిరుచానూరు: తిరుచానూరు గ్రామ పంచాయతీ లోని పోక్కలమ్మ ఆలయానికి రూ.6లక్షల18వేలు విలువ గల వెండి ఆభరణాలు, రూ. 3లక్షల తో 250 కిలోల పంచలోహ సులాని కుంటి గంగమ్మ గుడికి తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్ర రెడ్డి దంపతులు కానుకగా సమర్పించారు. వారికి ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. ఆ సామగ్రిని అందజేసిన తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్ర రెడ్డి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు ఎంపీటీసీ నరేష్ రెడ్డి, బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ బి యోగనందరెడ్డి, వార్డు మెంబర్లు, తిరుచానూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొరియా ఏపీసిఐసిటి డిజిటల్ లీడర్స్‌కార్యక్రమంలో పాల్గొనండి..

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌కు, మరో ఇద్దరికి ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజిని కి దక్షిణ కొరియాలో నిర్వహించే డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించే వార్షిక ఏపీసిఐసిటి డిజిటల్ లీడర్స్ కార్యక్రమానికి హాజరు కావాలి ఆహ్వానం అందినట్లు పిఆర్వో డాక్టర్ రజిని ఓ ప్రకటనలో తెలిపారు. ఆమెతో పాటు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ఆచార్య పి విజయలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్ పర్సన్ ఆచార్య పి ఉమామహేశ్వరిలకూ ఆహ్వానం అందినట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వారు పాల్గొంటున్నట్లు తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా, ఈ ఈవెంట్‌ను ఇంచియాన్ మెట్రోపాలిటన్ సిటీ, ఎపిసిఐసిటి (సమాచారం, కమ్యూనికేషన్ టెక్నాలజీ , కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆసియా, పసిఫిక్ శిక్షణా కేంద్రం) సహ-ఆర్గనైజ్ చేస్తున్నారు. గవర్నమెంట్ ప్రతినిధిగా ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ గవర్నమెంట్ ప్రతినిధిగా హాజరుకానున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని సబ్జెక్ట్ ఎక్స్‌పెర్టుగా పాల్గొననున్నారు. ప్రొఫెసర్ పి విజయలక్ష్మి యు ఎన్ ఏపీ సి ఐ టిసి వైపై కన్సల్టెంట్ హోదాలో హాజరు కానున్నారు. డిజిటల్ లీడర్స్ ప్రోగ్రామ్ ప్రధాన లక్ష్యం డిజిటల్ లీడర్స్, ఛాంపియన్‌ల నెట్‌వర్క్ బలో పేతం , డిజిటల్ ట్రాన్స్‌ఫర్మే షన్, ఇన్నో వేషన్ ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలకు సాధికారత కల్పించే పనికి మద్దతు ఇస్తుంది. ఈ కార్యక్రమం పాల్గొనేవారికి కేంద్రం వైపై (ఉమెన్ ఐసిటి ఫ్రాంటియర్ ఇనిషియేటివ్) ప్రోగ్రామ్ ఉన్నత-స్థాయి అవలోకనాన్ని అందిస్తుంది. మహిళా పారిశ్రామి కవేత్తల డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధికి



తోడ్పడేందుకు కీలకమైన కీలక సమస్యలను హైలైట్ చేయడం, డిజిటల్ సాధికార తపై దృక్కోణా లు, మంచి అభ్యాసాలను పంచుకో వడానికి, అభివృద్ధి చెందు తున్న సామర్థ్యాన్ని పెంపొం దించే అవసరాలను గుర్తించ డానికి ఒక వేదికను అందిస్తుంది. కొత్త వైపై శిక్షణ మాడ్యూల్స్ కూడా సమావేశం లో ప్రతిపాదన, సమీక్ష కార్యక్రమాలు వుం టా యని వారు పేర్కొన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ కనెక్షన్

ప్రజాశక్తి - బాలాయపల్లి : తెల్ల రేషన్ కార్డులో ఉన్న వారికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తామని వైసిపి మండల అధ్యక్షులు, జయంపు సహకార సంఘం అధ్యక్షులు వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రజా సమస్యలపై ఆయన మాట్లాడుతూ ఉచితంగా గ్యాస్ పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పొందడానికి గతంలో గ్యాస్ కనెక్షన్ ఉండకూడదని, ఇక రేషన్ కార్డు తప్పని సరిగా ఉండాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కొత్తగా సపరేట్ రేషన్ కార్డు తీసుకుని గ్యాస్ కనెక్షన్ లేని వారికి ఉపయోగ పడుతుందన్నారు. ఉజ్వల యోజన గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ కనెక్షన్ తీసుకున్న వారికి, ఇకపై గ్యాస్ బుక్ చేసుకున్న ప్రతిసారి అదనపు సబ్సిడీ డబ్బులు లభిస్తాయన్నారు.

టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని వికృతమాలలో టిడిపికి చెందిన మిఠాయి కార్తీక్ రాయల్ శ్రీకాళహస్తి వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులు చూసి పార్టీలోకి వచ్చానని తెలిపారు. ఏర్పేడు మండలం వైసిపి ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు తెలుసు కొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తున్నారని తనకు నచ్చి ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, జడ్పిటిసి డాక్టరు కావేరి తిరుమలయ్య, మండల అధ్యక్షులు రమణ యాదవ్, ఐతేపల్లి గురునాథం, ఏర్పేడు మండలం సోషల్ మీడియా ఇన్‌ఛార్జి కేశవరెడ్డి పాల్గొన్నారు.


క్షేత్రస్థాయి ప్రదర్శనలో పాల్గొన్న వ్యవసాయ శాఖాధికారులు

ఆరోగ్యానికి, అధిక దిగుబడికి చిరు ధాన్యాలు

ప్రజాశక్తి- వెంకటగిరి రూరల్ : ఆహారంలో భాగంగా చిరు ధాన్యాలను తీసుకోవాలని వీటి వల్ల ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం సంచాలకులు డాక్టర్ కర్ణశ్రీ అన్నారు. పెరియావరంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో చిరు ధాన్యాల క్షేత్ర ప్రదర్శనశాలకు విశిష్ట అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ రైతుల ప్రదర్శనలో సమావేశానికి అధ్యక్షులు డాక్టర్ గోవిందరాజులు ఆధ్వర్యంలో సిరి ధాన్యాల క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాలను ప్రతి రైతు పండించాలని కోరారు. అనంతరం ఏడిఏ వ్యవసాయ ఉప సంచాలకులు నాగార్జునసాగర్ మాట్లాడుతూ మెట్టు ప్రాంత రైతులు వర్ష పాతం తక్కువగా ఉన్నా చిరు ధాన్యాల పంటను వేసుకోవచ్చని తద్వారా అధిక దిగుబడి, ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపాల్, డాక్టర్ నాగార్జున రెడ్డి, రాజీవన పాల్గొన్నారు.


పెళ్లి కానుక పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి అనుచరులు

పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని సొంత నిధులతో చంద్రగిరి నియోజక వర్గంలో జరుగుతున్న పెళ్లిళ్లకు పెళ్లికానుకను అంది స్తున్నారు. అందులో భాగంగా స్థానిక భాకరాపేట గ్రామపంచాయతీ గాంధీనగర్ లో నివాసం ఉంటున్న పి దుర్గ విడ్స్, ఎం అనిల్ కుమార్25వ తేదీ పెళ్లి సందర్భంగా అమ్మవారి పసుపు కుంకుమ, బంగారు తాళిబొట్టు, వెండి బాసికాలు, వెండి మెట్టెలు వధూవరులకు పట్టు వస్త్రాలు, పెళ్లి కుమార్తెకు గాజులు, స్వీట్ బాక్స్ గ్రీటింగ్ కార్డ్‌ను ఎమ్మెల్యే పంపారు. ఈ పెళ్లి కానుకను సర్పంచ్ సాకిరి భూపాల్ , డివిజన్ అధ్యక్షులు తమ్మిశెట్టి గురు శంకర్, ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ నేరుగా ఇంటికి వెళ్లి కానుకను అందించారు. వధూవరులు వారి కుటుంబ సభ్యులు చెవిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.


స్వరూప్ డెన్నిని సన్మానిస్తున్న సీనియర్ బిషప్‌లు

ఎమ్ స్వరూప్ డెన్నీకి ఘనంగా పట్టాభిషేకం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని విద్యానగర్ సమీపంలో ఉన్న హోలీ ప్రేయర్ మందిరంలో సీనియర్ బిషప్ ఎం.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఆయన ద్వితీయ కుమారుడు ఎమ్ స్వరూప్ డెన్నిని జిల్లా సీనియర్ బిషప్ లు చేతుల మీదగా హోలీ ఆర్డినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఘనంగా సన్మానించి పట్టాభిషేకం పొందడంతో ఎమ్.స్వరూప్ డెన్ని ని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్.సన్నీ అభిలాష్ జన్మదిన జ్ఞాపకార్థం సందర్భంగా విద్యానగర్ లోని హోలీ ప్రేయర్ మందిరంలో స్వరూప్ డెన్ని కి హోలీ ఆర్డినేషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జిల్లా స్థాయిలో ఉండే బిషప్ లు మైకేల్ బెన్హర్, బిషప్ డేవిడ్ దయాసాగర్, బిషప్ ఓలా.రవికుమార్ లు స్వరూప్ డెన్ని కి పట్టాభిషేకాన్ని ఘనంగా స్వీకరించారు. ఈ హోలీ ఆర్డినేషన్ కి హాజరైన ప్రతి ఒక్కరూ ఎమ్ స్వరూప్ డెన్నిని అభినందించారు. ఈ కార్యక్రమానికి కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల నుండి భారీగా క్రైస్తవులు, పాస్టర్లు హాజరయ్యారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: సిఐటియు

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు మండలంలో అత్యధికంగా ఆటో కార్మికులు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని ప్రభుత్వం వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి అరుణాచలం డిమాండు చేశారు.మండలంలోని సత్యవేడు టు ఊతుకోట శ్రీ సరస్వతి ఆటో యూనియన్ స్థలంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి ఎం రమేష్ ఆధ్వర్యంలో విజయదశమి వేడకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డి అరుణాచలం మాట్లాడుతూ సత్యవేడు ఆటో యూనియన్ వాళ్లకి సత్యవేడు ప్రజలకు కార్మికులకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు సత్యవేడులో ఆటో స్టాండ్ సౌకర్యం కల్పించడంతోపాటు ఆటో యూనియన్ కు ఆఫీస్ స్థలం కేటాయించాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని వెంటనే ఆటో యూనియన్ వారికి ఆఫీస్ స్థలం కేటాయించాలన్నారు. సత్యవేడు మండలంలో 28 పంచాయతీలలో


దసరా వేడుకలు నిర్వహిస్తున్న ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు

ఆటో కార్మికులు ప్రజలకు సేవ చేస్తున్నారని, వారికి మొత్తం 2వేల ఓట్లు ఉన్నాయి, ఈ ప్రభుత్వం ఆఫీస్ స్థలం కేటాయించకపోతే ఆటో కార్మికులు రాబోయే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఆటో యూనియన్ ప్రసిడెంట్ పన్నీర్ ఉపాధ్యక్షులు అన్బు, కార్యదర్శి పలని, మోహన్ బాబు, స్టీఫెన్, ఇబ్రహీం, గిరి, మోహన్, రమేష్, వినోద్, చిన్న రాసి, ఏలుమలై, రాఖీ, రూబన్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సంగీతం, సాహిత్యంతో ప్రశాంతమైన జీవితం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశ్రాంత ఉద్యోగుల జీవనం సంగీతం, సాహిత్యంతో ముడిపడి ఉంటే ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చని శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ పేర్కొన్నారు. పుత్తూరులోని ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ తన 60వ అష్టావధానాన్ని నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భాస్కర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ అష్టావధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ విద్యాభవన్ తిరుపతి కేంద్ర సంచాలకులు డాక్టరు నడింపల్లి సత్యనారాయణరాజు హాజరయ్యారు. పుత్తూరు, పరిసర ప్రాంతాల్లోని సీనియర్ సిటిజన్స్ హాజరై అష్టావధానాన్ని ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. తిరుపతికి చెందిన శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ అష్టావధానానికి మరో శతావధాని ఆముదాల మురళి సంచాలకులుగా వ్యవహరించారు. పృచ్ఛకులుగా నిషిద్ధాక్షరికి ఒంటె రవి, సమస్యకు గండుపల్లి గోవిందయ్య, దత్తపదికి శోభా రాజ, న్యస్తాక్షరికి వేంకటరమణ, వర్ణనకు చంద్రశేఖర శర్మ, ఆశువుకు రంగన్న, ఛందోభాషణకు


అష్టావధానంలో పాల్గొన్న శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ

మల్లెల నాగరాజు, అప్రస్తుత ప్రసంగానికి పాలూరి బ్రహ్మానంద రెడ్డి హాజరై అవధానికి పలు ప్రశ్నలు సంధించారు. కాగా పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు శతావధాని ఉప్పల ధడియం భరత్ శర్మ తనదైన శైలిలో దీటుగా పద్యాలతో సమాధానాలను ఇచ్చి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కథారచయిత ఆర్‌సి కృష్ణస్వామిరాజు, చంద్రబాబు, హైకోర్టు అడ్వకేట్ మెరుపుల మహేశ్, విజయ్ కుమార్ పిళ్ళై , గాయకులు సోము ఉమాపతి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక కపిల తీర్థం సమీపంలోని ప్రేమ్ దామ్ మందిరంలో జై అంబి సేవా మండల్ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న నవరాత్రి వేడుకలు విజయదశమి రోజు ముగిశాయి. ఈ సందర్భంగా తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ జై అంబి సేవా మండల్ ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాలుగా నవరాత్రి ఉత్సవాలు కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన హిందీ మాట్లాడే ప్రజలు తిరుపతిలో అనేక వ్యాపారాలు చేస్తూ పలు సేవా కార్యక్రమాలతో పాటు దేశం కోసం ధర్మం కోసం జరిగే అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెప్పారు. గత తొమ్మిది రోజులుగా మందిరంలో దుర్గాదేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తూ దాండియా గార్బా నృత్యాలు చేస్తూ ఆనందంగా నవరాత్రి ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జై


నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న తిరుపతి కార్పొరేషన్ మేయర్ శిరీష

అంబి మండల్ నిర్వాహకులు ప్రవీణ్ జైన్, రోషన్ పరెక్,సంపత్ సోని,అరుణ్ సింగ్,హిమత్ సింగ్,రణ్వీర్ గాహ్లెట్, శ్యామ్ గెహ్లెట్, భవేష్,భవిక్ పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు పురపాలక సంఘ పరిధిలోని నెల్లటూరు గ్రామంలో దేవి శరన్నవరాత్రుల దసరా వేడుకల సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి జెండా మహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామివారిని ఆయన చిత్రపటాన్ని ట్రాక్టర్ పై ఉంచి గ్రామంలో ఊరేగించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయ మానంగా మేళతాళాలు, తప్పెట్లు డిజె సౌండ్లు, కీలుగుర్రాలు విచిత్ర వేషధారణలతో, బాణ సంచ వేడుకలతో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.

పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం శ్రీ బొమ్మరాజపురం గ్రామపంచాయతీ మాతమ్మ తల్లీ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 9వ రోజు విజయదశమి రోజు అమ్మవారికి వేదమంత్రోచ్చారణ నడుమ వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం మహిళల స్వహస్తాలచే పాలాభిషేకం నిర్వహించారు. పసుపు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మాతమ్మ ప్రత్యేక పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ నిర్వాహకులచే అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారిని పురవీధులలో వైభవంగా విద్యుత్ దీపాలంకరణలతో ఊరేగించారు.

రామచంద్రాపురం: దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా రాయలచెరువు కట్ట కింద ఉన్న రాయల మండపంలో కాళీ కాలభైరవ కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. మంగళవారం ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు కాళీ, కాలభైరవ స్వామి ఉత్సవ విగ్రహాలకు పసుపు కుంకుమ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ స్వామి అమ్మవార్లకు కళ్యాణోత్సవం నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు వెదురుకుప్పం, తిరుపతి, వడమాల పేట, పుత్తూరు, చంద్రగిరి, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు ప్రతాప్ స్వామి, గుండాల గోపీనాథ్ రెడ్డి అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. రాత్రి 7 గంటలకు సూరావారి పల్లి వద్ద ఉన్న సురభి గోశాల ఆవరణంలో దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను భక్త భజనలు. కోలాటాలు. డబ్బులు వాయిస్తూ బాణాసంచాలు పేలుస్తూ కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే గురునాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లోకనాథ్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.





విజయదశమి వేడుకలు నిర్వహిస్తున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డి

కట్టా దంపతుల విజయదశమి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నాయుడుపేట: విజయదశమి పండుగ సందర్భంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్ రెడ్డి, నాయు డుపేట జడ్‌పిటిసి కట్టా జ్యోతి రెడ్డి మండల ప్రజలకు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు విజయదశమి శుభా కాంక్షలు తెలి పారు. మంగళ వారం వారు మేనకూరులోని కెఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయం వద్ద విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలని కోరారు. రాష్ట్ర ప్రజల సుఖ, సంతోషాల కోసం నిరంతరం కృషి చేస్తున్న సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కె ఎస్ ఆర్ కన్‌స్ట్రక్షన్స్ మేనేజర్ షేక్ రఫీ, అత్తి కాయల నరేంద్ర, కె ఎస్ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకల్యాణ వెంకన్న నవరాత్రి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు సోమవారం ఉదయం 7 గంటల నుంచి చక్రస్నానం ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కంకణభట్టార్ గిరిధర్ భట్టాచార్యులు



ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అనంతరం చక్రస్నానం, ఇందులో విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమోక్తంగా స్నపనం నిర్వహించారు. ఉపనిషత్తు మంత్రాలు, దశశాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధం లోని అభిషేక సమయంలో దేవదేవునికి అనుసంధానం చేసే వేదాలను పారాయణం చేశారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. సోమవారం సాయంత్రం 5.30 నుండి 7 గంటల మధ్యన జరిగిన ధ్వజావరోహణంతో బ్రహ్మోత్స వాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షు లు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలకు అభినందనలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ఈశ్వరపురం దుర్గమ్మ ఆలయంలో మూడు రోజులు పాటు సేవలు, ఆదివారం, సోమవారం మంగళవారం మూడు రోజులు పాటు పుత్తూరులోని ఈసలాపురం కొండపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో అత్యధికంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని స్కౌట్స్ అండ్ గైడ్స్ విశిష్ట సేవలు అందించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమంలో, తాగునీటిని అందించే విభాగంలో, భక్తులను క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా భక్తులకు సేవలు అందించారు. ఈ సేవలను ఆలయ అధికారులు, శల్య వైద్య నిపుణులు ఎస్ ప్రకాష్ రాజు, శివానంద స్వామి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి ఫల ప్రసాదాలు అందించారు. వారికి ప్రత్యేక రవాణా సౌకర్యాలు కల్పించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ ఏ వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో నర్వహించారు. ఈ కార్యక్రమంలో రేంజర్ లీడర్ భువనేశ్వరి, మల్లేశ్వరి, సాయి ప్రసన్న, గైడ్స్ లీడర్ యువ శ్రీ, మధుమిత, హేమాద్రి, జై కుమార్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన లారీ ముందు భాగం

లారీని ఢీకొన్న బస్సు

- ఒకరు మృతి, పది మందికి గాయాలు

ప్రజాశక్తి-పాకాల: బస్సు లారీని ఢీకొనడంతో లారీ డ్రైవర్ మృతి చెందగా, బస్సు డ్రైవర్‌తో పాటూ పదిమంది ప్రయాణికులకు గాయాలైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. బస్సు నెల్లూరు నుండి తిరుపతి మీదుగా చిత్తూరు వెళ తోంది. లారీ తిరుపతి నుండి మదురై కి వెళుతుండగా నేషనల్ హైవే మార్గమధ్యంలో ఇరుగు రంగయ్యగారిపల్లి సమీపంలో సోమవారం ఉదయం మూడు గంటల ప్రాంతంలో బస్సు లారీని ఢీకొంది. లారీ డ్రైవర్ ఎస్.సెంథిల్ కుమార్(37) తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరు జిల్లాకు చెందిన బస్సు డ్రైవర్ వి దేవిడ్‌తో పాటూ పదిమంది ప్రయాణి కులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ సెంథిల్ కుమార్ పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందాడు. పాకాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అదుపు తప్పి ప్రమాదానికి గురైన కారు

కారు అదుపు తప్పి నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని తానిగల్లు మలుపు వద్ద సోమవారం కేరళ కు చెందిన కారు అదుపుతప్పి ప్రమా దానికి గురి అయింది. ఈ ప్రమా దంలో తమిళ నాడుకు చెందిన కుటుంబీకులు తిరుమలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యా యని తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీస్ సిబ్బంది స్పందించి క్షత గాత్రులను శ్రీకాళహ స్తి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఎస్ఐ వెంకట నరసింహం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీ

ఒకరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొడంతో అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మరణించగా, మరొకరు గాయపడిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..ద్విచక్రవాహనంపై బుచ్చి నాయుడు కండ్రిగ టౌన్ కి వెళుతున్న బాలసుబ్ర మణ్యం (35), గంధం ఉష (27) ను నీర్పకోట చెంగాలమ్మ గుడి దగ్గర వెనుక వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీచక్రాలు వారిపై దూసుకు పోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. బాలసుబ్ర మణ్యంను చికిత్స నిమిత్తం రాయవేలూరుకు తరలిం చారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. దళితవాడ దగ్గర గంధం ఉషా బైకు ఆపి ఎక్కింది. ప్రమాదంలో గాయపడిన ఆమెను స్థానికులు ఆటోలో శ్రీకాళహస్తి ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవరు ఆదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తునున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు.

టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - క్యాంపస్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో ఎమ్ఆర్ పల్లి సర్కిల్‌లో ఆంధ్రప్రదేశ్ కు పట్టిన దరిద్రం పోవాలని అనే పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన జగన్ పాలన పోవాలని డిమాండ్ చేశారు. గత నాలుగున్నర సంవత్సరంగా ఎటువంటి డీఎస్సీ ప్రకటన గాని, గ్రూప్1, గ్రూప్ 2 నోటిఫికేషన్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థులు కూడా డిగ్రీ, పీజీ కోర్సులలో చేరే సంఖ్య పూర్తిగా తగ్గి పక్క రాష్ట్రాలకు తరలిపోయే విధంగా అక్కడ మీకు ఇయర్ ను జూన్ జూలై నుంచి సెప్టెంబర్ అక్టోబర్ కు తీసుకొచ్చిన ఘనత ఆయనదే నన్నారు. ముఖ్యం గా రాష్ట్రంలో ఉన్నత విద్యా మండలి పూర్తిగా అకాడమిక్ ఇయర్ ను నాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "రావణ సుర దహనం" అరాచక విధ్వంసక పాలన సాగిస్తున్న సైకో జగనాసురుడి పీడ పోవాలని సైకో పోవాలి అని రాసి ఉన్న పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో 19,20,21,22 డివిజన్ అధ్యక్షులు కార్యదర్శులు కొండారెడ్డి, శ్రీనివాసులు, రామచంద్ర రెడ్డి, మధు, దాము ఆచారి, ప్రవీణ్, చిన్న, సాయి పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సూచన పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వర మంగళంలో మాజీ ఎంపీపీ , చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య ఆధ్వర్యంలో రావణాసుర దహనం మనం చేద్దాం జగనాసుర దహనం, అరాచకంపై యుద్ధం, సైకో జగనాసురుడి పీడ పోవాలి..' అనే కరపత్రాలను మంటల్లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర మంగళం టిడిపి నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నినాదాలు చేశారు.


పుత్తూరులో

గూడూరు: గూడూరు పట్టణంలోని టిడిపి నాయకులతో కలసి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ జగనాసుర దహనం కర పత్రాలను మంటల్లో దహనం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్ర బాబు అరెస్టుకు నిరసన తెలుపుతుంటే పోలీసు లు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. తమ వ్యక్తి గత స్వేచ్ఛకు కి భంగం కలిగిస్తున్నారు ఇక్కడ ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, మాజీ కౌన్సిలర్ వాటంబేటి శివ కుమార్, గాయం రమణయ్య, దువ్వూరు రవీంద్ర రెడ్డి, యదనపర్తి జనార్ధన్ రెడ్డి, తక్కెల్లపాటి చంద్ర మౌళి , ఎసుపాక పెంచలయ్య, అమరయ్య నాయుడు, యువత వేముల సునీల్, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావని రెడ్డి, కార్యదర్శి గుండాల భారతి, గూడూరు పట్టణ మహిళా అధ్యక్షులు గుండాల శ్రీదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గూడూరులో

వేలము ప్రకటన

27-10-2023 వ తేది ఉదయ 11.00 గంటలకు రేణిగుంట మండలం, వెంకటాపురం గ్రామ పంచాయతి పరిధిలో గల ఈ క్రింది చేపల చెరువుల యందు చేప పిల్లలు వేసి, పెంచుకొని అమ్ముకొను హక్కులను 1433 ఫసలికి బహిరంగ వేలము గ్రామ పంచాయతి కార్యాలయ ఆవరణము నందు నిర్వహించబడుచున్నది. సదరు వేలములో పాల్గొను వారు ఈ క్రింది తెలిపినటువంటి షరతులకు బద్ధులై వేలము నందు పాల్గొనవచ్చును.

వేలపు షరతులు : -

1 వేలములో పాల్గొను వారు ఈ క్రింది తెలుపబడినటువంటి చెరువులకు వాటికి ఎదురుగా తెలుపబడిన డిపాజిట్టు మొత్తమును చెల్లించి వేలము నందు పాల్గొనవలెను.

వరుస సంఖ్య	చేపల చెరువు పేర్లు	సర్కారు పాట	చెల్లించవలసిన డిపాజిట్టు
1.	తిమ్మాయగుంట చెరువు	11,00,000-00	50,000-00
2.	మాదిగవాణిగుంట చెరువు	5,30,000-00	40,000-00
3.	ఆర్, అగ్రహారం ఎగువ చెరువు	2,16,500-00	40,000-00
4.	ఆర్, అగ్రహారం దిగువ చెరువు	1,00,400-00	20,000-00
5.	అంకమనాయుడు మిట్టగుంట	22,000-00	2,000-00
6.	అన్నాస్వామిపల్లి చెరువు	9,51,000-00	50,000-00

2. వేలము పాటలో పాల్గొను వారు ఆయా చెరువులకు తెలిపిన పాల్వెన్సీ మొత్తమునకు పాల్వెన్సీ సర్టిఫికేట్‌ను మండల తహశీల్దారు వద్ద నుండి గాని, సంబంధిత అధికారుల వద్ద నుండి పొంది గ్రామ పంచాయతికి డిపాజిట్టు చేయవలెయును. ఇతర వివరములు కొరకు కార్యాలయము పని దినములులో సంప్రదించగలరు.

యమ్.సుశీల
సర్పంచ్, వెంకటపురం
గ్రామపంచాయతి, రేణిగుంట మండలం.

పి. యూసుఫ్ ఖాన్
పంచాయతి కార్యదర్శిF.A.C
వెంకటపురంగ్రామపంచాయతి,
రేణిగుంట మండలం.